

నారాయణఖేడ్ : తుర్కపల్లిలో ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున బారులు తీరిన ప్రజలు

## రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

నారాయణఖేడ్, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలు చోట్ల చెదురుమదురు ఘటనలు జరిగినప్పటికీ పోలీసుల జోక్యంతో సద్దుమణిగాయి. నారాయణఖేడ్ మండలం జూకల్, సంజీదన్‌రావుపేట్‌లో ఈవీఎంలు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. మండలంలోని సంజీవన్‌రావు పేట్, తుర్కపల్లిలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన పోలింగ్ అటు తర్వాత పుంజుకుంది. ఉదయం 9 గంటల తర్వాత ఓటేసేందుకు జనం ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో పెద్ద ఎత్తున బారులు తీరారు.

**పోలింగ్ సరళి ఇలా..**

ఉదయం 7నుంచి 9గంటల వరకు 10:35శాతం ఉండగా, 11 గంటల వరకు కాస్త పుంజుకుని 26:02శాతంగా నమోదైంది. అనంతరం ఒంటి గంటకు ఒకేసారి 20శాతానికి పెరిగి 45.43శాతం నమోదు కాగా 3గంటల వరకు తిరిగి మందకోడిగా సాగిన పోలింగ్ 52.02శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు 75.34 శాతం పోలింగ్ నమోదు కాగా నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.

**సిర్గాపూర్ మండలంలో మొరాయించిన ఈవీఎం**

సిర్గాపూర్, నవంబర్ 30: మండలంలోని చీమల్‌పాడ్, కడ్పల్ గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చీమల్‌పాడ్‌లో పోలీసు సిబ్బంది ఒక్కరే ఉండటంతో చెదురు, ముదురు సంఘటనలు జరిగాయి. సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి ఇరు పార్టీల వారిని చెదరగొట్టారు. కడ్పల్‌లో పోలీసుల చర్యలు తీసుకున్నారు. వాసర్‌లో 81వ బూత్ ఈవీఎం మొరాయించగా 40నిమిషాలు పోలింగ్ నిలిచింది. అప్పుడు అధికారులు దాన్ని సరిచేశారు. సిర్గాపూర్‌లోని 92 పీఎస్‌లో ఈవీఎం మొరయించి గంట సమయం వృథా అయింది. గర్డెగాం 88వ పీఎస్‌లో వీవీప్యాడ్ పని చేయలేదు. గంట పాటు పోలింగ్ ఆగిపోయింది. అప్పటికే సగం పోలింగ్ అయింది. తర్వాతా ఇతర వీవీప్యాడ్ అమర్చగానే ఓటింగ్ కొనసాగింది. అయితే గర్డెగాంలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగడంతో పొద్దుపోయినా పోలింగ్ కొనసాగింది.

## హత్నూరలో స్వల్ప లాఠీచార్జి

హత్నూర, నవంబర్ 30 : హత్నూరలో పోలీసులు స్వల్పలాఠీ చార్జి జరిగింది. గురువారం పోలింగ్ స్టేషన్‌కు సమీపంలో బీజేపీ కార్యకర్తలు నరేంద్రమోదీ ప్లకార్డు, తామరపువ్వు చూపెడుతూ ప్రచారం నిర్వహించడంతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ కండువాలు ధరించి ప్రచారం చేపట్టారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలించడానికి వచ్చిన పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీన్‌రెడ్డి బీజేపీ కార్యకర్తల చేతిలోని మోదీ ప్లకార్డును తీసివేయాలని తెలపడంతో పాటు ఇతర పార్టీల నాయకులు ధరించిన కండువాలు తీసివేయాలని సూచించే క్రమంలో పోలీసులకు కార్యకర్తల మధ్య వాగ్వివాదం తలెత్తగా స్వల్ప లాఠీచార్జి చేశారు. దీంతో సీఐ డౌన్‌డౌన్ అంటూ అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు నినాదాలు చేయడంతో స్థానిక ఎస్ఐ సుభాష్ అక్కడకు చేరుకొని గొడవ సద్దుమనిగేలా చేయడంతో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది.



అందోల్ : డాకూర్‌లో కొడుకు, కోడలితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి



కల్హేర్ : కృష్ణాపూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు, పురుషులు



మునిపల్లి : తాటిపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పోతులబొగుడలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన క్రాంతికిరణ్
- డాకూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీ చైర్ పర్సన్, మర్వెల్లిల్లో మఠం భిక్షపతి



పుల్కల్ : పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం యువకులతో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్, నవంబర్ 30 : అందోల్ అసెంబ్లీ స్థానానికి గురవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గం వ్యాప్తంగా 303 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉదయం 7నుంచి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు ఊపదుకుంది. అందోల్‌లోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సమయం ముగిసిన ఓటర్లు ఓటేసేందుకు క్యూలైన్లో నిలబడ్డారు. 5గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు సిరియల్ నంబర్లను అందజేసిన అధికారులు ప్రతి ఒక్కరికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. గ్రామాల్లో దివ్యాంగులు, వృద్ధులు సహాయకులతో వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. వట్‌పల్లి మండలం పోతులబొగుడలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. డాకూర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి కొడుకు, కోడలితో కలిసి ఓటేశారు. వట్‌పల్లి మండలం మర్వెల్లిలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందోల్ మండలం తాలెల్మ, వట్‌పల్లి మండలం నాగులపల్లిలో ఈవీఎం మిషన్లు మొరాయించడంతో పోలింగ్ కొంత ఆలస్యమైంది. 1417మంది సిబ్బంది విధులు నిర్వహించగా, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని సమిక్షించినట్లు పేర్కొన్నారు. 600మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారి బాలాజీ తెలిపారు.



హత్నూర : నూతనంగా ఓటువేసిన యువతీయువకులు



నారాయణఖేడ్ : తుర్కపల్లిలో బారులు తీరిన ప్రజలు



కల్హేర్ : మహాదేవుపల్లిలో మొదటి సారి ఓటు వేయబోతున్న దివ్యాంగుడు నీరుడి పవన్‌కుమార్



సిర్గాపూర్ : పోచాపూర్‌లో బారులు తీరిన ఓటర్లు



చౌటకూర్ : ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



మునిపల్లి : బుసారెడ్డిపల్లిలో ఓటు హక్కు వినియంగించుకున్న యువకులు



పుల్కల్ : వృద్ధురాలిని ఓటేయడానికి తీసుకెళ్తున్న దృశ్యం